సాక్షి నారాయణపేట

బుధవారం । 21 । జూన్ । 2023



యోగా.. దివ్యౌషధం

ఒత్తిడి, అనారోగ్యంతో బాధపడేవారికి యోగా వరంలా ఉపయోగపడుతుంది.

వివరాలు 8లో ▸



స్పోర్ట్స్ స్కూల్‌కు వేళాయె

స్పోర్ట్స్ స్కూళ్లలో 4, 5వ తరగతిలో చేరికకు సెలక్షన్స్ నిర్వహించనున్నారు.

వివరాలు 10లో ▸

గరిష్టం/కనిష్టం
38.4 /27.3

వాతావరణం

ఉదయం నుంచి ఎండ తీవ్రత ఉంటుంది. అప్పుడప్పుడు ఆకాశం మేఘావృతమై తేలిక పాటి వర్షం పడే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

పదోన్నతులు బాధ్యత పెంచుతాయి



నారాయణపేట రూరల్: ప్రతి ఉద్యోగి జీవితంలో పదోన్నతులు వారి బాధ్యతలను రెట్టింపు చేస్తాయని ఎస్పీ ఎన్.వెంకటేశ్వర్లు అన్నారు. జిల్లాలో ఎస్‌ఐలు విధులు నిర్వహిస్తున్న రాములు, లక్ష్మయ్యకు సీఐలుగా పదోన్నతి రావడంతో మంగళవారం స్థానిక జిల్లా పోలీసు కార్యాలయంలో అభినందించారు. ఈ సందర్భంగా వారికి సీఐ ర్యాంకును సూచించే త్రిస్టార్స్‌ను యూనిఫామ్స్‌కు తొడిగి సత్కరించారు. విధి నిర్వహణలో నిబద్ధతతో ముందుకుపోవాలని, క్రమశిక్షణ, సమయపాలన పాటిస్తూ ప్రజలకు చేరువ అయ్యే విధంగా ప్రవర్తించాలని చెప్పారు. డీఎస్పీ సత్యనారాయణ, ఎస్‌బీ సీఐ రాంలాల్ పాల్గొన్నారు.

విద్యార్థులకు అడ్మిషన్ పత్రాలు

నారాయణపేట: 2023–24 విద్యా సంవత్సరానికి గాను జిల్లాకు చెందిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, దివ్యాంగ విద్యార్థిని, విద్యార్థులు కార్పొరేట్ కళాశాలలో ఇంటర్‌లో ఆన్‌లైన్ ద్వారా అడ్మిషన్ పొందిన వారికి మంగళవారం కలెక్టర్ కోయ శ్రీహర్ష చేతుల మీదుగా అడ్మిషన్ పత్రాలు అందించారు. మొదటి విడతలో ఎస్సీ 8, ఎస్టీ 3, బీసీ 8, ఓబీసీలో 1, దివ్యాంగుల్లో ఒకరు ఎంపికయ్యారు. కార్పొరేట్ కళాశాలలో అడ్మిషన్ పొందిన విద్యార్థులను కలెక్టర్ అభినందించారు. బాగా చదువుకొని తల్లిదండ్రుల కలలను సాకారం చేయాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధి అధికారి కన్యాకుమారి ఉన్నారు.

పనులు త్వరగా పూర్తి చేయాలి

నారాయణపేట: జిల్లా కేంద్రంలోని హైదరాబాద్ రోడ్‌కు సమీపాన ఉన్న బీసీకాలనీ పార్కు పనులను త్వరగా పూర్తి చేయించాలని అడిషనల్ కలెక్టర్ మయాంక్ మిట్టల్ మున్సిపల్ అధికారులకు సూచించారు. రూ.కోటి వ్యయంతో మూడు ఎకరాల్లో నిర్మిస్తున్న పార్కు పనులను పరిశీలించారు. నాణ్యతగా పనులను పూర్తి చేయాలని చెప్పారు. మున్సిపల్ కమిషనర్ సునీత, ఏడీ విజయ్‌భాస్కర్, ఏఈ మహేశ్ ఉన్నారు.



టెండర్లు జీరో..



రోహు చేపపిల్లలు

చేపపిల్లల సరఫరాకు వ్యాపారుల అనాసక్తి

- ప్రభుత్వ ధరకు అందించలేమని అంటున్న వైనం
- రెండుసార్లు అవకాశం ఇచ్చినా అందని దరఖాస్తులు
- 650 చెరువుల్లోకి 1.87 కోట్ల చేపపిల్లల పంపిణీకి ప్రణాళిక

నారాయణపేట: జిల్లాలో చేపపిల్లల పంపిణీకి రెండు సార్లు టెండర్లకు పిలిచినా ఎవరూ ముందుకురావడం లేదు. దీంతో అధికారులు ఎటూ తేల్చలేక ఉన్నతాధికారులకు నివేదికలు పంపారు. మత్స్యకారులకు జీవనోపాధి కల్పించాలనే లక్ష్యంతో వంద శాతం సబ్సిడీపై చేపపిల్లలను పంపిణీ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు జిల్లాలో కలెక్టర్ దిశానిర్దేశంతో జిల్లా మత్స్యశాఖ అధికార యంత్రాంగం ప్రణాళికలను సిద్ధంచేసి టెండర్లకు పిలుపునిచ్చింది. కానీ ఎవరూ చేప పిల్లలను సరఫరా చేసేందుకు ముందుకు రాలేదు. ప్రభుత్వం నిర్ణయించిన ధరలకు వ్యాపారస్తులు విముఖత వ్యక్తం చేస్తున్నారు. కలెక్టర్ కోయ శ్రీహర్ష నియమించిన టెండర్ల కమిటీ చైర్మన్ జిల్లా అడిషనల్ కలెక్టర్ మయాంక్ మిట్టల్, మెంబర్, కం కన్వీనర్‌గా జిల్లా మత్స్యశాఖ అధికారి రానాప్రతాప్ ఆధ్వర్యంలో టెండర్ల ప్రక్రియను ఈ ప్రొక్యూర్‌మెంట్‌ను ఈనెల 12న ఓపెన్ చేసి చూడగా ఒక్క దరఖాస్తు కూడా రాలేదు. దీంతో ఈ నివేదికను రాష్ట్ర ఉన్నతాధికారులకు జిల్లా మత్స్యశాఖ అధికారులు పంపించినట్లు తెలుస్తోంది.

గడువు పెంచినా..

చేపపిల్లలను సరఫరా చేసేందుకు గతనెల 5న బిడ్ కాలింగ్ చేస్తూ రాష్ట్ర ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. బిడ్ డాక్యుమెంట్‌ను గతనెల 12 నుంచి డౌన్‌లోడ్ చేసుకునేందుకు అవకాశం కల్పించారు. డాక్యుమెంట్‌లను డౌన్‌లోడ్ చేసుకున్న వారు దరఖాస్తు చేసుకునేందుకు తొలిసారిగా మే 30 గడువు విధించారు. అప్పటి వరకు ఏ ఒక్క కాంట్రాక్టర్ ముందుకు రాకపోవడంతో మరోసారి గడువును జూన్ 12వరకు పెంచింది. అయినప్పటికి చేప పిల్లలను పంపిణీ చేసేందుకు ఎవరూ ముందుకు రాలేదు. ఈ విషయం టెండర్లను ఓపెన్ చేయడంతో స్పష్టమైంది. ప్రభుత్వం నిర్ణయించిన ధరలకు చేప పిల్లలను పంపిణీ చేయలేమని బహిరంగంగానే కాంట్రాక్టర్లు చెబుతున్నట్లు తెలుస్తోంది. రెండుసార్లు అవకాశం ఇచ్చిన ప్రభుత్వ ధరకు గిట్టుబాటు కాదనే ముందుకు రావడంలేదని సమాచారం.

ధరలు పెరిగేనా.. టెండర్లు అయ్యేనా?

ప్రభుత్వం నిర్ణయించిన ధరలు కాక కాంట్రాక్టర్లు ఆశించిన స్థాయిలో ధరలు పెరుగుతాయనేది కష్టమే అనిపిస్తోంది. చేప పిల్లలను పంపిణీ చేసేందుకు ట్రాన్స్‌ఫోర్ట్ ఖర్చులతో పాటు విత్తనోత్పత్తి ఖర్చులు పెరిగాయంటూ వ్యాపారస్తులు బహిరంగంగానే చెబుతున్నారు. అయితే ప్రభుత్వం నిర్ణయించిన ధరలకు సరఫరా చేయలేమంటూ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న చేపపిల్లల వ్యాపారస్తులు ఏకమై ఎక్కడా టెండర్లు వేయలేదని తెలుస్తోంది. ప్రభుత్వం ధరలు పెంచకపోతే సకాలంలో టెండర్లు అయ్యే అవకాశం కనిపించడం లేదనిపిస్తోంది.

రూ.1.78 కోట్లతో ఆహ్వానం..

ఈ ఏడాది చేపపిల్లలను పంపిణీ చేసేందుకు ప్రభుత్వం ధరలు నిర్ణయించింది. పెద్దసైజు చేపపిల్లలు (80–100 ఎంఎం) 81.03 లక్షల చేపలకు గాను రూ.1.22 కోట్లు నిర్ణయించింది. టెండర్లు దక్కించుకున్న వారు బొచ్చ40 శాతం, రోహు 50 శాతం, మ్రిగాల 10శాతం చేప పిల్లలను సరఫరా చేయాల్సి ఉంటుంది. అదేవిధంగా చిన్న చేపపిల్లలకు (45–40 ఎంఎం) ధర రూ.56.17 లక్షలు నిర్ణయించి టెండర్లకు పిలిచింది. అయితే టెండర్లు వేసే వ్యాపారస్తులు 106.29 లక్షల చేపపిల్లలను (బొచ్చ 35శాతం, రోహు 35శాతం, బంగారు తీగ 30శాతం చొప్పున) సరఫరా చేయాల్సి ఉంటుంది.

టెండర్లు వేయలేదు..



చేప పిల్లలను పంపిణీ చేసేందుకు ఆన్‌లైన్‌లో టెండర్లు వేసేందుకు ఈనెల 12తో గడువు ముగిసింది. అయితే టెండర్లు ఎవరూ వేయలేదు. సంబంధిత నివేదికలను ఉన్నతాధికారులకు పంపించాం. త్వరలో మళ్లీ టెండర్లు పిలిచే అవకాశం ఉంది. – రానాప్రతాప్, జిల్లా మత్స్యశాఖ అధికారి, నారాయణపేట

2020 నుంచి చేప పిల్లల ధరలు ఇలా..

చేప పిల్లల పంపిణీ విషయంలో ప్రతి ఏటా ఇదే పరిస్థితి కొనసాగుతుంది.

2020వ సంవత్సరంలో జిల్లాలోని 590 చెరువులు, మూడు రిజార్వాయర్‌లో వదిలేందుకు కావాల్సిన 1.60 కోట్ల చేపపిల్లల(సీడ్స్)ను రూ.96.10 లక్షలతో కైకలూరి నుంచి కోనుగోలు చేసింది. అందులో 85–100 ఎంఎం సైజు చేపపిల్లలు లక్షకు రూ. 1.04,000 చొప్పున 40లక్షలు కొనుగోలు చేయగా, 35–40 ఎంఎం సైజు చేపపిల్లలు లక్షకు 45,786 చొప్పున 1.20 కోట్లు కొనుగోలు చేసింది.

- 2021లో సంవత్సరంలో 1.84 కోట్ల చేప పిల్లలను చేసేందుకు టెండర్లు పిలువగా వనపర్తి జిల్లాకు చెందిన ఓ కాంట్రాక్టర్ ముందుకు వచ్చి రూ.1.49 కోట్లకు టెండర్లు వేసి సరఫరా చేశారు. అందులో 85–100 ఎంఎం సైజు చేపపిల్లలు లక్షకు రూ.1.58,000 చొప్పున 43లక్షల చేప పిల్లలకు గాను రూ.67,46,600లు, 35–40 ఎంఎం సైజు చేపపిల్లలు.. లక్ష పిల్లలకు 58వేల చొప్పున రూ1.41 కోట్ల చేప పిల్లలకుగాను రూ.82,24,980లకు సరఫరా చేశారు.
- 2022 లో టెండర్లు వేసిన వారిలో ఎల్–1 తప్పుకోవడంతో మిగతా నలుగురు కలిసి చేప పిల్లలను పంపిణీ చేశారు. చేపపిల్లలను పంపిణీ చేసిన వారిలో పద్మనాగ భూని నాగ వెంకటసూర్య సతీస్ రాజ్‌కుమార్ కైకలూరు (ఏపి) 35–40 ఎంఎం రూ.43,800, 80–100 ఎంఎంకు రూ.1,33,650కు ఎల్2గా టెండర్ దక్కించుకున్నారు. అయితే టెండర్లలో పాల్గొన్న మరో ముగ్గురు సైతం రాజ్‌కుమార్‌తో కలసి (అక్వా స్పార్క్ హచారీ నర్వ మండలం ఉందేకోడ్‌కు చెందిన వ్యాపారి, డి.శివకుమార్ ఆత్మకూర్ మండలం అరెపల్లికి చెందిన వ్యాపారి) చేప పిల్లలను పంపిణీ చేశారు.

ఆరోగ్యకేంద్రంలో కలెక్టర్ ఆకస్మిక తనిఖీ



ఆస్పత్రి పరిసరాలను పరిశీలిస్తున్న కలెక్టర్ శ్రీహర్ష

దామరగిద్ద: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ కోయ శ్రీహర్ష మంగళవారం ఆకస్మికంగా పర్యవేక్షించారు. ఆపరేషన్ థియేటర్ ల్యాబ్, జనరల్ వార్డు, ఓపీ, మెడిసిన్ సదుపాయాలను పరిశీలించారు. ఈనెల 27, 28 తేదీల్లో నేషనల్ క్వాలిటీ అస్యూరెన్స్ స్టాండర్డ్ (ఎన్‌క్యూఎస్) బృందం పీహెచ్‌సీని సందర్శించనున్నట్లు తెలిపారు. ఆస్పత్రి సేవలను, సవిల్ వర్కులను, డెలివరీస్ వంటి ఆస్పత్రి సదుపాయాలను ప్రత్యేకంగా పరిశీలిస్తారన్నారు. కేంద్రం పరిశీలన బృందం అవార్డు పొందితే, ఏటా రూ.3లక్షల అభివృద్ధి నిధులు కేటాయించి, అవసరమైన ఆరోగ్య సదుపాయాలను కల్పించి, అభివృద్ధి చేసుకునే అవకాశం ఉందన్నారు. అవార్డును పొందేందుకు అవసరమైన అన్నిసేవలను, సదుపాయాలను కల్పించుకొని మెరుగైన సేవలు అందించాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారి భిక్షపతి, ఎంపీపీ నర్సప్ప, వైద్యాధికారి నాగజ్యోతి, ఏఈపీఆర్ నర్సింగ్, సిబ్బంది పాల్గొన్నారు.

15 లక్షల మొక్కలు లక్ష్యం

- ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులకు ఆదేశం
- వర్షాలు మొదలయ్యేలోపు గుంతలు తవ్వాలి : కలెక్టర్ శ్రీహర్ష

నారాయణపేట: 2023–24 సంవత్సరానికి గాను హరితహారం 9వ విడతలో 15 లక్షల మొక్కలు నాటేలా ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని కలెక్టర్ శ్రీహర్ష అన్నారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయంలో 2023–24 అవెన్యూ ప్లాంటేషన్ హరితహారం కార్యక్రమంలో భాగంగా అధికారులతో మాట్లాడుతూ నారాయణపేట, మక్తల్ మార్గంలో అవెన్యూ ప్లాంటేషన్ నిర్వహించాలన్నారు. జక్లేర్, నర్వ నర్సరీల్లో ఉన్న వేపచెట్లు, గుల్మోహరం, అల్లనేరేడు, టేకు మొక్కలు నాటేలా చర్యలు తీసుకోవాలన్నారు. రెండు, మూడు రోజుల్లో గుంతలు తవ్వడం పూర్తి చేయాలన్నారు. ఊట్కూర్‌లో ఫిట్టింగ్ పనులు పూర్తి చేయాలని సింగారం గేటు నుంచి లేబర్‌ను ఎక్కువగా తీసుకొని పనులు పూర్తి చేయాలన్నారు. కోస్గిలో ఇంటికి 10మొక్కల చొప్పున పంపిణీ చేయాలని ఆదేశించారు. 35 కిలోమీటర్ల వరకు రెండు మీటర్ల దూరం చొప్పున మొక్కలు నాటేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. కృష్ణా దగ్గర వేర్వేరుగా మొక్కలు నాటేందుకు చర్యలు చేపట్టాలన్నారు. కూలీల చెల్లింపులు సత్వరం నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో అడిషనల్ కలెక్టర్ మయాంక్ మిట్టల్, జిల్లా అటవీశాఖ అధికారి వీణవాణి, డీఆర్‌డీఓ గోపాల్‌నాయక్, జెడ్పీ సీఈఓ జ్యోతి, డీపీఓ మురళి, ఎంపీడీఓలు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి పెద్దపీట



ఉపాధ్యాయులకు ట్యాబ్‌లు అందజేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ వనజమ్మ, కలెక్టర్ శ్రీహర్ష

- ఘనంగా విద్యాదినోత్సవం
- హాజరైన కలెక్టర్, జెడ్పీ చైర్మన్



విద్యార్థినుల నృత్యం

నారాయణపేట: ప్రభుత్వం విద్యాభివృద్ధికి పెద్దపీట వేసిందని, విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలని, తెలంగాణ రాష్ట్ర గౌరవాన్ని మరింత పెంచాలని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ వనజమ్మ అన్నారు. మంగళవారం తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో కలెక్టర్ కోయ శ్రీహర్షతోపాటు జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం మాట్లాడారు. సీఎం కేసీఆర్ నేతృత్వంలో బీఆర్ఎస్ ప్రభుత్వం విరివిగా గురుకులాలు ఏర్పాటు చేసి, నాణ్యమైన విద్యను అందిస్తున్నదన్నారు. పిల్లలు ఆరోగ్యంతో ఉండాలని రాగి జావాను ఈరోజు నుంచే ప్రారంభించామని తెలిపారు. అలాగే కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ మనఊరు –మనబడి కార్యక్రమం ద్వారా జిల్లాలో మొదటి దశ కింద 170 పాఠశాలలను బాగు చేసుకున్నామని తెలిపారు. రానున్న రోజుల్లో జిల్లా విద్యలో ముందుండేలా చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఈ సందర్భంగా లైబ్రరీని ప్రారంభించి, 45రోజుల రీడింగ్ పేపర్‌ని ఆవిష్కరించారు. జాలి ఇంటర్నేషనల్ వారి సహకారంతో బిగ్ బ్యాంక్ పుస్తకాన్ని ఆవిష్కరించారు. అలాగే విద్యార్థులకు వర్క్ బుక్కులు, టెక్స్ట్ బుక్స్, నోట్‌బుక్స్ అందజేశారు. అనంతరం ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానించారు. ఈ వేడుకల్లో విద్యార్థుల సంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ సురేశ్, జెడ్పీటీసీలు అంజలి, అశోక్‌గౌడ్, ప్రకాశ్‌రెడ్డి, లావణ్య, ఎంపీపీ శ్రీనివాస్‌రెడ్డి, విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.



నృత్యం చేస్తున్న బాలిక

ఆధ్యాత్మిక వెలుగులు

- గ్రామీణ ప్రాంత దేవాలయాల్లో మోగనున్న గుడిగంటలు
- ధూప, దీప, నైవేద్య పథకం కింద మరో 339 ఆలయాల ఎంపిక
- దశాబ్ది వేడుకల్లో భాగంగా నేడు నియామక పత్రాల అందజేత
- ఉమ్మడి జిల్లాలో 654కు చేరిన డీడీఎన్ఎస్ పథకం
- అర్చకులకు పెరగనున్న వేతనాలు

జిల్లాల వారీగా ఎంపికైన ఆలయాలు..

మహబూబ్‌నగర్	నారాయణపేట	వనపర్తి	నాగర్‌కర్నూల్	జోగుళాంబ గద్వాల
113	80	44	73	29



పెద్దకడ్మూర్‌లోని బాలబ్రహ్మేశ్వర ఆలయం

జోగుళాంబ శక్తిపీఠం(అలంపూర్)/ నర్వ: గ్రామీణ ప్రాంతాల్లో ఆధ్యాత్మిక వెలుగులు నింపే క్రమంలో 2004 సంవత్సరంలో అప్పటి ముఖ్యమంత్రి దివంగత వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రవేశపెట్టిన నిత్య ధూప, దీప, నైవేద్య పథకం ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని అర్చకుల జీవితాల్లో ఆనందపు గంటలు మోగిస్తున్నాయి. ఇప్పటి వరకు 315 ఆలయాలు ధూప, దీప, నైవేద్య పథకం కింద ఉండగా.. తాజాగా మరో 339 నూతన ఆలయాలను ఎంపిక చేశారు. దీంతో 654 ఆలయాలు ఈ పథకంలోకి వచ్చేశాయి. 2004లో తొలిసారిగా అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి రూ.2,500ల వేతనంతో ఈ పథకాన్ని తీసుకురాగా.. కేసీఆర్ ప్రభుత్వం దీనిని రూ.6 వేలకు పెంచింది. కాగా రూ.10వేలకు వేతనం పెంచనున్నారు. ఇదిలా ఉండగా నూతన ఆలయాల కింద ఎంపికైన వాటికి బుధవారం దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఆధ్యాత్మిక దినోత్సవం రోజున నియామక పత్రాలు ఇవ్వనున్నట్లు జిల్లా దేవాదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాసరావు, డీడీఎన్ఎస్ సెలక్షన్ కమిటీ సభ్యుడు ఆనంద్‌శర్మ, గద్వాల జిల్లా నోడల్ ఆఫీసర్ పురేందర్‌కుమార్ తెలిపారు.

దశాబ్ది వేడుకల కానుకగా..



ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు ధూప, దీప, నైవేద్యం పథకం కింద నూతనంగా 339 ఆలయాలు ఎంపికయ్యాయి. ఎంపిక ఆలయాల జాబితాను ప్రకటిస్తూ నియాకమ పత్రాలను ఆధ్యాత్మిక దినోత్సవం రోజున కలెక్టర్, మంత్రులు, ఎమ్మెల్యే, ఇతర ప్రముఖుల చేతులమీదుగా అందజేస్తారు. – గాదిరాజు శ్రీనివాసరాజు, ఎండోమెంట్ అసిస్టెంట్ కమిషనర్

ఆశయాలు నెరవేర్చాలి..



గ్రామీణ ప్రాంతాల్లో ఆర్థిక లేమితో చీకట్లో ఉన్న ఆలయాలకు వెలుగులు నింపేందుకు దేవాదాయశాఖ ప్రవేశపెట్టిన ఈ పథకం ఆశయాలు నెరవేర్చేందుకు అటు అర్చకులు ఇటు గ్రామస్తులు కలిసికట్టుగా పనిచేసి ఆధ్యాత్మిక చైతన్యానికి పెద్దపీట వేయాలి. జిల్లాలోని ఆలయాలకు సముచిత స్థానం కల్పించినందుకు కృతజ్ఞతలు. – పురేందర్‌కుమార్, జిల్లా నోడల్ ఆఫీసర్, గద్వాల

అర్చకులకు నియామక పత్రాలు..

డీడీఎన్ పథకం ద్వారా జిల్లాలో 68 ఆలయాలను రెండు విడతల్లో ఎంపిక చేశాము. మూడో విడత దరఖాస్తు చేసుకునేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. దీంతో ఈ మూడో విడతలో మరో 80 ఆలయాలను ఈ పథకానికి ఎంపిక చేశాం. ఇక్కడి అర్చకులకు ఈనెల 21న నియామకపత్రాలు అందజేస్తాం. – శ్రీనివాస్, ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్, నారాయణపేట జిల్లా

ఎంపిక చేయడం సంతోషం..

పెద్దకడ్మూర్‌లోని కాకతీయుల కాలంనాటి అతి పురాతన చారిత్రక నేపథ్యం కలిగిన బాలబ్రహ్మేశ్వర ఆలయం ఉంది. కొన్నేళ్లుగా భక్తుల సహకారంతో పూజ్యాధి కైంకర్యాలు నిర్వహిస్తున్నాను. మూడో విడతలో దరఖాస్తు చేసుకోగా ఆలయాన్ని ఎంపిక చేశారు. డీడీఎన్ పథకానికి ఎంపిక చేయడం సంతోషం. ఎంపికకు కృషి చేసిన ఎమ్మెల్యే, ప్రజాప్రతినిధులకు కృతజ్ఞతలు. – తంబలి నర్సింహయ్య, అర్చకులు బాలబ్రహ్మేశ్వర ఆలయం పెద్దకడ్మూర్, నర్వ మండలం

మక్తల్ మున్సిపాలిటీకి రాష్ట్రస్థాయి అవార్డు

మాగనూర్(మక్తల్): మక్తల్ మున్సిపాలిటీకి హరితహారంలో రాష్ట్రస్థాయిలో అవార్డు దక్కడం చాలా సంతోషంగా ఉందని చైర్‌పర్సన్ పావని అన్నారు. ఈ సందర్భంగా ఆమె విలేకరులతో మాట్లాడుతూ పట్టణంలో హరితహారంలో భాగంగా ఐదు ఎకరాల్లో టీ పార్కు , రెండెకరాల్లో బృహత్ పట్టణ ప్రకృతివనాలు ఏర్పాటు చేశామని అన్నారు. రెండు కిలోమీటర్ల మీడియన్ ప్లాంటేషన్, అవెన్యూ ప్లాంటేషన్ చేపట్టామని తెలిపారు. మున్సిపాలిటీని రాష్ట్రస్థాయిలో ఎంపిక చేయడంతో హైదరాబాద్‌లో నిర్వహించిన హరితోత్సవంలో మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి చేతుల మీదుగా సోమవారం అవార్డు అందుకున్నట్లు తెలిపారు.



మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న చైర్‌పర్సన్ పావని

కార్పొరేట్ స్థాయిలో ప్రభుత్వ బడులు

నర్వ: కార్పొరేట్ స్థాయిలో ప్రభుత్వ బడులను మన ఊరు మన బడి కార్యక్రమం ద్వారా తీర్చిదిద్దుకున్నామని ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి అన్నారు. మంగళవారం పాథర్చేడ్, పెద్దకడ్మూర్ ఉన్నత పాఠశాలలలో నిర్మాణం పూర్తిచేసుకున్న అదనపు తరగతులను, డిజిటల్ క్లాస్‌రూంలను ఆయన రిబ్బన్ కట్‌చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా పెద్దకడ్మూర్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడుతూ రూ.43లక్షలతో మొదటి ఫేస్‌లో నిర్మాణాలు పూర్తి చేసుకోని ప్రారంభించుకున్నామని అన్నారు. విద్యార్థులకు కార్పొరేట్‌ను తలదన్నేలా డిజిటల్ క్లాస్ రూమ్‌లు, డైనింగ్‌హాల్స్, స్వచ్ఛమైన తాగునీటిని అందించే ప్లాంట్‌లను, సోలార్ ప్లాంట్‌లను, ఏర్పాటు చేసుకుని కొత్తహంగులతో, రంగులతో నేడు పాఠశాలలు రూపుదిద్దుకున్నాయని అన్నారు. విద్యార్థులు ఒక లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకుని చదువుకోవాలని అన్నారు. నియోజకవర్గంలో నాలుగువేల ఇళ్ల ఏర్పాటు కోసం త్వరలో గృహలక్ష్మి పథకం ద్వారా అందించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రమేష్‌కుమార్, ఎంఈఓ వెంకటయ్య, ఎంపీపీ జయరాములుశెట్టి, విండో చైర్మన్ లక్ష్మన్న, రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు చిన్నయ్య, వైస్‌ఎంపీపీ వీణావతి, సర్పంచ్ శశిరేఖ, ఎంపీటీసీ రాధమ్మ, హెచ్‌ఎంలు పాల్గొన్నారు.



పెద్దకడ్మూర్‌లో తరగతి గదిని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రాంమోహన్‌రెడ్డి తదితరులు

మూడు ఎకరాల్లో ప్లాట్‌ల ఏర్పాటుకు వినతి..

పెద్దకడ్మూర్‌లోని 342 సర్వే నంబర్‌లో పేదలకు ఇళ్ల స్థలాలను అందించాలని పీఏసీఎస్ చైర్మన్ లక్ష్మన్న, ఎంపీటీసీ రాధమ్మ, వెంకటయ్య గ్రామస్తుల తరఫున ఎమ్మెల్యేను కోరారు. ఇందుకు స్పందించిన ఎమ్మెల్యే తహసీల్దార్‌కు సర్వే చేయించాలని చెబుతానని అర్హులకు మాత్రమే ఇళ్ల స్థలాలను అందించాలని సూచించారు.

క్లుప్తంగా

చికిత్స పొందుతూ యువతి మృతి


అశ్విని(ఫైల్)

కోస్గి: పురుగుమందు తాగి ఆత్మహత్య యత్నం చేసిన ఓ యువతి చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందింది. బాధితుల కథనం మేరకు.. మండల పరిధిలోని మీర్జాపూర్ గ్రామానికి చెందిన పటేల్ అశ్విని(18) 12ఏళ్ల క్రితం తల్లిదండ్రుల్ని కోల్పోయింది. అశ్విని, తన అన్న శివకుమార్‌ను వారి పెదనాన్న కొంతకాలం చూసుకున్నారు. తర్వాత వికారాబాద్‌లో అమ్మమ్మ వద్ద ఉంటూ చదువుకున్నారు. శివకుమార్ డిగ్రీ చదువుతూ హైదరాబాద్‌లో ఉంటున్నాడు. అశ్విని అమ్మమ్మ దగ్గరే ఉంటోంది. స్వగ్రామంలో వ్యవసాయ పొలాలు ఉండటంతో ముంబై, ఇతర ప్రాంతాల్లో ఉండే పెదనాన్నతో కలిసి అప్పుడప్పుడు అన్నాచెల్లెలు స్వగ్రామానికి వచ్చి పోతుండేవారు. ఈ క్రమంలో గత నెల 29న ముంబై నుంచి పెదనాన్న కుటుంబం స్వగ్రామానికి రావడంతో అన్నాచెల్లెలు సైతం గ్రామానికి వచ్చారు. అశ్వినికి పెళ్లి చేయాలని నిర్ణయించారు. కట్నకానుకలు, పెళ్లి, ఇతర కుటుంబ విషయాల్లో చోటుచేసుకున్న వాదనలకు అశ్విని మనస్తాపానికి గురైంది. అదేరోజు రాత్రి ఇంట్లో గడ్డిమందు తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు కోస్గి ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో వికారాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి మెరుగుపడకపోవడంతో హైదరాబాద్ తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం అశ్విని మృతి చెందింది. వేధించే మాటల వల్లే తన చెల్లెలు ఆత్మహత్య చేసుకుందని సోదరుడు శివకుమార్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై శ్రీనివాసులు తెలిపారు.

చెరువులో మునిగి విద్యార్థి ..


ఉదయ్(ఫైల్)

ఖిల్లాఘనపురం: చెరువులో ఈత కొడుతు నీటిలో మునిగి ఓ విద్యార్థి మృతి చెందిన సంఘటన వనపర్తి జిల్లా ఖిల్లాఘనపురం మండలంలో చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం.. సల్కెలాపురం గ్రామానికి చెందిన గొల్ల శివ, శివమ్మల పెద్ద కుమారుడు ఉదయ్(13) మామిడిమాడ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నాడు. సోమవారం సాయంత్రం పాఠశాల నుంచి ఇంటికి వచ్చిన విద్యార్థి గ్రామానికి ఆనుకుని ఉన్న ఉప్పరివాని చెరువులో తోటి విద్యార్థులతో కలిసి ఈతకు వెళ్లాడు. గడ్డపై నుంచి దూకిన ఉదయ్ నీటిలో మునిగిపోయాడు. గమనించిన తోటి విద్యార్థులు గ్రామస్తులకు సమాచారం ఇవ్వడంతో.. వెంటనే వచ్చిన వారు చెరువులో వెతకగా.. విగతజీవిగా కనిపించాడు.

మహిళ ఆత్మహత్యాయత్నం

మహమ్మదాబాద్: గడ్డి మందుతాగి ఓ మహిళ ఆత్మహత్యా యత్నానికి పాల్పడింది. వివరాల్లోకి వెళితే.. మంగళవారం గండేడ్ మండలంలోని జక్లపల్లి గ్రామానికి చెందిన ఓ మహిళ ఉదయం 10గంటలకు తన ఇంట్లో ఉన్న గడ్డి మందు తాగి ఆత్మహత్య యత్నానికి పాల్పడింది. ఈ విషయాన్ని గుర్తించిన కుటుంబీకులు వెంటనే 108 అంబులెన్సుకు సమాచారం అందించారు. దీంతో పైలెట్ అక్బర్, ఈఎన్‌టీ సాయికుమార్ ఆమెకు ప్రథమ చికిత్స చేసి, మహబూబ్‌నగర్ జనరల్ ఆస్పత్రికి తరలించారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు.

వృద్ధురాలి ఆత్మహత్య

నాగర్‌కర్నూల్ క్రైం: ఓ వృద్ధురాలు చెరువులో దూకి ఆత్మహత్యకు పాల్పడింది. ఈ సంఘటన మున్సిపాలిటీ పరిధిలోని నాగనూలు చెరువులో చోటుచేసుకోగా, మంగళవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఎస్సై విజయ్‌కుమార్ తెలిపిన వివరాలు.. జిల్లాకేంద్రంలోని బీసీకాలనీకి చెందిన సంద బక్కమ్మ(85) చాలారోజులుగా అనారోగ్య సమస్యలతో బాధపడుతోంది. ఈనెల 17న ఇంట్లో ఎవరికి చెప్పకుండా బయటికి వెళ్లి, నాగనూలు చెరువులో దూకి ఆత్మహత్యకు పాల్పడింది. మూడు రోజులుగా కుటుంబ సభ్యులు ఎంత వెతికినా ఫలితం లేకపోయింది. మంగళవారం నాగనూలు చెరువులో మృతదేహం కనిపించడంతో గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఈ మేరకు పోలీసులు అక్కడికి వెళ్లి పరిశీలించి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జనరల్ ఆస్పత్రికి తరలించారు. కూతురు అంజనమ్మ ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

సారా స్వాధీనం.. వ్యక్తి రిమాండ్

నవాబుపేట: సారా విక్రయిస్తూ పట్టుబడిన వ్యక్తిని పోలీసులు రిమాండ్ తరలించారు. ఎక్సైజ్ సీఐ వీరారెడ్డి కథనం ప్రకారం.. మండలంలోని కాకర్‌జాల్‌తండా చెందిన గంగ్యానాయక్ సారా విక్రయిస్తూ మంగళవారం పోలీసులకు పట్టుబడ్డాడు. ఇతనికి గతంలో ఫైన్లు వేసినా, కేసులు నమోదు చేసినా పట్టించుకోలేదని అందుకే రిమాండ్‌కు తరలించినట్లు సీఐ వివరించారు.

యోగా.. ఆరోగ్య దివ్యౌషధం



ప్రస్తుత యాంత్రిక జీవనంలో ఎన్నో ఒత్తిళ్లు, దీర్ఘకాలిక సమస్యలతో బాధపడేవారికి యోగా ఒక వరంలా ఉపయోగపడుతుంది. భారతీయ యోగాకు ప్రపంచవ్యాప్తంగా ప్రత్యేకమైన గుర్తింపు ఉంది. పీఎం నరేంద్రమోదీ కృషితో ప్రపంచంలో యోగాకు ప్రముఖస్థానం దక్కింది. ప్రపంచంలోని వందలాది దేశాల్లో యోగాసాధన చేస్తున్నారు. నేడు (బుధవారం) జూన్ 21వ తేదీన అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం...

- యోగాలో తల్లీకూతురి ప్రతిభ
- రాణిస్తున్న వనజారెడ్డి, కీర్తన
- అబ్బురపరిచిన యోగా ప్రదర్శనలు

యోగాలో కీర్తన ప్రతిభ..

2018 జిల్లా కేంద్రంలో జరిగిన జిల్లాస్థాయి యోగా పోటీల్లో కీర్తన పాల్గొంది. అండర్–10లోపు విభాగం బాలికల పోటీల్లో ప్రతిభచాటి ప్రథమ స్థానంలో నిలిచింది. అదే ఏడాది పెద్దపల్లిలో జరిగిన రాష్ట్రస్థాయి యోగా పోటీల్లో జిల్లాకు ప్రాతినిధ్యం వహించింది. గత ఏడాది ఢిల్లీలో జరిగిన నేషనల్ యోగా ఒలింపియాడ్ పోటీల్లో పాల్గొని ప్రతిభ చాటింది. మెదక్‌లో గత ఏడాది జరిగిన కేంద్రీయ విద్యాలయం రాష్ట్రస్థాయి యోగా పోటీల్లో బంగారు పతకం సాధించింది.


వనజారెడ్డి, కీర్తన యోగా విన్యాసాలు

మహబూబ్‌నగర్ క్రీడలు: జిల్లా కేంద్రానికి చెందిన ఏఎస్‌ఐ గోటూర్ వనజారెడ్డి యోగాలో ప్రతిభ కనబరుస్తోంది. ఉద్యోగ ధర్మం నిర్వర్తిస్తూనే సత్తాచాటుతోంది. తన కూతురు కీర్తనకు శిక్షణ ఇవ్వడంతో సాయికీర్తన కూడా చిన్న వయస్సులోనే యోగాలో రాణిస్తున్నారు. ఎక్కడా యోగా శిక్షణ తరగతులు ఉన్నా తల్లి, కూతురు యోగా ప్రదర్శనలు ఇస్తూ తమకంటూ ఓ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంటున్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకల్లో వనజారెడ్డి, సాయికీర్తనలు యోగా ప్రదర్శన ఇచ్చి అందరి మన్ననలు పొందారు.

వనజారెడ్డి సాధించిన పతకాలు...


2007 నుంచి ఇప్పటివరకు పలుసార్లు జాతీయ, రాష్ట్రస్థాయి యోగా పోటీల్లో పాల్గొని పతకాలు సాధించింది. ఆదిలాబాద్ (బాసర)లో జరిగిన రాష్ట్రస్థాయి యోగా పోటీల్లో రజతం, 2016లో కర్నాటక (ఉడిపి)లో జరిగిన జాతీయస్థాయి యోగాలో బంగారు పతకం సాధించింది. అదే ఏడాది వైజాగ్‌లో జరిగిన పోలీస్ స్పోర్ట్స్ మీట్‌లో యోగాలో రజతం పొందింది. 2017 జార్ఖండ్ రాష్ట్రం రాంచీలో జరిగిన ఆలిండియా పోలీస్ స్పోర్ట్స్ మీట్ యోగా విభాగంలో బంగారు పతకం సాధించింది. 2018 పంజాబ్ రాష్ట్రం పటియాలో జరిగిన జాతీయస్థాయి యోగా పోటీల్లో రజత పతకం సాధించారు. 2022 ఏపీ రాష్ట్రం తాడేపల్లిగూడెంలో జరిగిన యోగా పోటీల్లో పాల్గొంది.


యోగాసనాలు చేస్తున్న వెంకటేశ్

కరాటే యోగా గురువు వెంకటేశ్..

జిల్లా కేంద్రానికి చెందిన కోటకదిర వెంకటేశ్ కరాటేతో పాటు యోగా మాస్టార్‌గా పేరొందారు. చిన్నారులు, యువతకు కరాటే శిక్షణ ఇవ్వడంతోపాటు ప్రత్యేకంగా యోగాలో కూడా శిక్షణ అందజేస్తున్నారు. ప్రతి ఏడాది జిల్లా కేంద్రంలో కరాటే, యోగా శిక్షణ శిబిరాలు నిర్వహిస్తూ చిన్నారులు, యువతకు శిక్షణ అందిస్తున్నారు. వెంకటేశ్ కరాటేలో1997లో బ్లాక్ బెల్టు అందుకున్నారు. జిల్లా కేంద్రానికి చెందిన బాలకిష్టయ్యగౌడ్ వద్ద యోగా నేర్చుకున్నారు. ప్రతి ఏడాది అంతర్జాతీయ యోగా దినోత్సవ వేదికల్లో యోగా విన్యాసాలను ప్రదర్శిస్తున్నారు. బ్యాక్ నమస్కారం యోగాసనం చేసి తన ప్రత్యేకతను చాటుకుంటున్నారు. 22ఏళ్ల నుంచి నిత్యం మహబూబ్‌నగర్ పట్టణంలోని ప్రభుత్వ మాడల్ బేసిక్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు కరాటే, యోగాలో శిక్షణ అందిస్తున్నారు.

29 ఏళ్లుగా యోగా సేవలో ప్రేమ్స్ హెల్త్‌క్లబ్


యోగాసనాలు చేస్తున్న డాక్టర్ ప్రేమ్‌కుమార్

జిల్లా కేంద్రానికి చెందిన డాక్టర్ ప్రేమ్‌కుమార్ 1994లో 'ప్రేమ్స్ హెల్త్‌క్లబ్‌ను ఏర్పాటు చేసి యోగాలో శిక్షణ అందజేస్తున్నారు. జిల్లా కేంద్రంలో 29 ఏళ్లుగా వేలాదిమందికి యోగాసనాలు చేయించారు. ఉద్యోగస్తులు, వ్యాపారస్థులు, అధికారులు ప్రతిరోజు ఉదయం 5 గంటల నుంచి 6.30 వరకు ప్రేమ్స్ హెల్త్‌క్లబ్‌లో యోగా శిక్షణ తీసుకుంటున్నారు. క్లబ్‌లో 50 ఏళ్లపైబడిన వారు కూడా చురుగ్గా యోగా చేస్తూ తమ ఆరోగ్యాన్ని కాపాడుకుంటున్నారు. యోగా చేయడం వల్ల సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని, కొన్ని దీర్ఘకాలిక వ్యాధులు యోగా వల్ల నయం అవుతాయని డాక్టర్ ప్రేమ్‌కుమార్ తెలిపారు. నేను స్వతహాగా డాక్టర్ అయినప్పటికీ క్లీనిక్ వచ్చే వారికి యోగా చేయమని సలహాలు ఇస్తుంటాను. గుల్బర్గాలో మెడిసిన్ చదివేటప్పుడు విద్యార్థులకు యోగాసనాలు చేయిస్తుండేవాడిని. జిల్లా కేంద్రంలో మిత్రుల సహకారంతో ప్రేమ్స్ హెల్త్ క్లబ్ ఏర్పాటు చేశాం. చాలామంది సభ్యులుగా చేరి యోగా శిక్షణ తీసుకుంటున్నారు. ఎలాంటి లాభాపేక్ష లేకుండా 29 క్లబ్ ద్వారా ఉచితంగా యోగా శిక్షణ అందజేస్తున్న. అందరికీ ఆరోగ్యం పంచాలన్నదే నా లక్ష్యం. జిల్లా కేంద్రంలో నాలుగు చోట్ల ప్రేమ్స్ హెల్త్‌క్లబ్ ఆధ్వర్యంలో యోగా శిక్షణ అందజేస్తున్నాం.

రెండు కార్లు ఢీ.. ఒకటి దగ్ధం

- అలంపూర్ మున్సిపాలిటీ పరిధిలో ఘటన
- కారులోని వారికి స్వల్పగాయాలు


దగ్ధమవుతున్న కియా కారు

అలంపూర్: రెండు కార్లు ఢీకొన్న సంఘటనలో, ఒక కారులో మంటలు చెలరేగి దగ్ధమైంది. అలంపూర్ మున్సిపాలిటీ ఇమాంపురం మలుపు వద్ద మంగళవారం సాయంత్రం ఈ ప్రమాదం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు.. హైదరాబాద్ శ్రీరాంనగర్‌కు చెందిన నాగరాజు, నవీన్, శివ, సువర్ణ, పద్మ, డిజైర్ కారులో అలంపూర్ వెళ్తున్నారు. కాగా అలంపూర్ కోర్టు ఏపీపీఓ కార్తీక్‌రాజు కియా కారులో అలంపూర్ నుంచి బయలుదేరారు. ఇమాంపురం ములుపు వద్ద కార్లు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో కార్తీక్‌రాజు కారులోంచి పొగలు వచ్చినట్లు స్థానికులు తెలిపారు. కాసేపటికే పొగలు కాస్తా మంటలుగా మారి పూర్తిగా కాలిపోయింది. స్థానికులు మరో కారును అక్కడి నుంచి దూరంగా తోసేశారు. పద్మకు స్వల్పగాయాలయ్యాయి. స్థానిక ఆస్పత్రికి తరలించారు. ఏపీపీఓకు గాయాలవడంతో కర్నూల్ ఆస్పత్రికి తరలించారు. ఎస్‌ఐ మహేందర్ సంఘటన స్థలాన్ని పరిశీలించి, ప్రమాద వివరాలు సేకరించారు. ఈ ప్రమాదానికి సంబంధించి ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్‌ఐ తెలిపారు.

విదేశాలకు నడిగడ్డ మామిడి


గట్టు శివారులోని మామిడి తోట

- రైతులకు శిక్షణ ఇవ్వనున్న ప్రసాద్ సీడ్స్
- తోతాపరి రకాన్ని ప్రోత్సహించనున్న సంస్థ

గద్వాల వ్యవసాయం: నడిగడ్డ మామిడి విదేశాలకు ఎగుమతి అయ్యే అవకాశం వచ్చింది. మామిడి బాగా పండించే జిల్లాలను గుర్తించిన కేంద్ర ప్రభుత్వం ఈ ఏడాది క్లస్టర్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం(సీడీపీ)ను తీసుకొచ్చింది. ఆసక్తి గల రైతులతో తోతాపరి రకం మామిడి సాగు చేయించి నాలుగేళ్ల పాటు అవసరమైన సలహాలు, సూచనలిచ్చి నాణ్యతగా పండించి విదేశాలకు ఎగుమతి అయ్యేలా చేస్తారు. ఈ బాధ్యతను ప్రసాద్ సీడ్స్‌కు ప్రభుత్వం అప్పగించింది.

క్లస్టర్ ఏర్పాటులో జిల్లాకు స్థానం..

దేశవ్యాప్తంగా మామిడి పండించే ప్రాంతాలను కేంద్రం గుర్తించింది. వంద క్లస్టర్లుగా విభజించగా.. అందులో ఉమ్మడి జిల్లా ఉంది. నడిగడ్డలో అమలు చేసే బాధ్యతను ప్రసాద్ సీడ్స్‌కు ప్రభుత్వం అప్పగించింది. ఈ సంస్థ మామిడి పండించే రైతులను ప్రత్యేకంగా గుర్తించి నాణ్యతగా పండించేలా సలహాలు, సూచనలు అందించనుంది. దీంతోపాటు విదేశాల్లో డిమాండ్ ఉన్న తోతాపరి రకాన్ని సాగుచేసేలా రైతులను ప్రోత్సహిస్తుంది. అవసరమైతే రాయితీ కూడా అందించి ప్రత్యేక శిక్షణనిస్తారు. పండించిన మామిడిని విదేశాలకు ఎగుమతి చేసేలా జాతీయ రహదారి సమీపంలో ప్యాకింగ్ హౌస్, కోల్డ్‌స్టోరేజీలను నిర్మించనుంది. ఇక జిల్లాలో ప్రస్తుతం బేనీషాన్ రకాన్ని పండిస్తున్నారు.

త్వరలో ఉద్యానశాఖ సిబ్బందికి శిక్షణ..

సీడీపీ అమలు చేయడానికి ప్రసాద్ సీడ్స్‌కు ఉద్యానశాఖ అవసరమైన సహకారాలు అందించనుంది. ఇందులో భాగంగా త్వరలో ఎంపికైన ఉద్యాన అధికారులు, సిబ్బందికి శిక్షణ ఇవ్వనున్నారు. ఆ తర్వాత అధికారులు ఆసక్తి గల రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించి నాణ్యమైన మామిడి పండించేలా ప్రోత్సహించి విదేశాలకు ఎగుమతి చేయనున్నారు.

రైతులకు ప్రయోజనం..

జిల్లా రైతులు మామిడిని ఆసక్తిగా పండిస్తున్నారు. అయితే సరైన మార్కెట్ సౌకర్యం లేక ఆశించిన మేర ధరలు లభించడం లేదు. కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో రైతులకు ప్రయోజనం చేకూరనుంది. ప్రస్తుతం జిల్లాలో ఎక్కువగా బేనీషాన్ రకాన్ని పండిస్తున్నారు. వారంతా తోతాపరి రకం సాగుచేసేలా ప్రోత్సహిస్తారు. మామిడి విదేశాలకు ఎగుమతి అయితే రైతులకు ఆర్థిక ప్రయోజనం చేకూరనుంది.

జిల్లాలో ఇలా.. (ఎకరాల్లో)

మామిడి సాగు	కాపుదశలో ఉన్నవి
5,050	3,020
ఈ ఏడాది తోతాపరి రకం సాగు లక్ష్యం	4,900

జిల్లా అనుకూలం..

పండ్ల తోటల సాగుకు ఎర్రటి, ఇసుకతో కూడిన ఎర్రని, ఒండ్రుతో కూడిన ఎర్రని నేలలు ఉండాలి. జిల్లాలో ఇలాంటి నేలల శాతమే అధికంగా ఉంది. సాగునీటి విషయానికొస్తే అటు తుంగభద్ర, ఇటు కృష్ణా నదులు, జూరాల, నెట్టెంపాడు, ఆర్డీఎస్ ప్రాజెక్టులు, రిజర్వాయర్లు, నోటిఫైడ్ చెరువులు ఉన్నాయి. వీటిన్నింటి ఫలితంగా బోరుబావుల్లో నీరు పుష్కలంగా ఉన్నాయి. వాతావరణ పరిస్థితులు సైతం ఇక్కడ అనుకూలంగా ఉండటంతో ఇక్కడి రైతులు మామిడితో పాటు బత్తాయి, దానిమ్మ, నిమ్మ తదితర పండ్లతోటల సాగుకు ఆసక్తి కనబరుస్తున్నారు.

అవగాహన కల్పిస్తాం..



కేంద్రం ఇటీవలే సీడీపీను తీసుకొచ్చింది. ఇందులో మామిడిని విదేశాలకు ఎగుమతి చేస్తారు. మామిడి రైతులను ప్రోత్సహించడంతో పాటు తోతాపరి రకం సాగుచేసేలా అవగాహన కల్పిస్తాం. సిబ్బంది శిక్షణ పూర్తయిన తర్వాత దీనిపై పూర్తిస్థాయిలో దృష్టి సారిస్తాం. – మహ్మద్ అలీ అక్బర్, జిల్లా ఉద్యాన అధికారి

రిషి విద్యార్థులను అభినందించిన మంత్రి


నీట్ ర్యాంకర్‌లను అభినందిస్తున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: ప్రభుత్వం విడుదల చేసిన నీట్ ఫలితాల్లో జాతీయస్థాయిలో సత్తా చాటిన రిషి కళాశాల విద్యార్థులను మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అభినందించారు. ఈ మేరకు కళాశాల విద్యార్థులు అనుష్క (672), మౌర్య (653), ఎస్వీ క్రితిక్ (630), యోగేందర్‌యాదవ్ (604)తో పాటు ఐఐటీలో ఆలిండియా 37వ ర్యాంకు సాధించిన బాలర్దన్‌ను మంత్రి పుష్పగుచ్ఛంతో గుచ్ఛంతో అభినందించారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ జిల్లా విద్యార్థులు జాతీయస్థాయిలో పోటీ పరీక్షల్లో సత్తా చాటడం గొప్ప విషయం అన్నారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ చంద్రకళ వెంకట్, ముఖ్య సలహాదారు వెంకటయ్య, డీన్ భూపాల్‌రెడ్డి, ప్రిన్సిపాల్ లక్ష్మారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

భూతగాదాల కారణంగానే హత్య

నిందితులకు 14 రోజుల రిమాండ్

ఆత్మకూర్: భూతగాదాల నేపథ్యంలోనే అన్నను తమ్ముడు, తమ్ముడి కొడుకు హత్య చేశారని సీఐ కేఎస్ రత్నం తెలిపారు. ఆత్మకూర్ మండలంలోని మూలమల్ల గ్రామంలో పొలంవద్ద పాగనాటి రాంరెడ్డితో సోదరుడు శ్రీనివాస్‌రెడ్డి, ఆయన కుమారుడు కన్నారెడ్డి ఆదివారం సాయంత్రం గొడవపడ్డారని అన్నారు. రాంరెడ్డిపై రాయితో దాడి చేయడంతో తీవ్రంగా గాయపడ్డాడని, అనంతరం పక్కనే ఉన్న బావిలోకి తోసేసి పరారయ్యారని వివరించారు. రాంరెడ్డి కుమారుడు శేఖర్‌రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు గాలింపు చేపట్టి నిందితులను మంగళవారం వనపర్తి జిల్లాకోర్టుకు హాజరు పర్చామని, న్యాయమూర్తి 14రోజులు రిమాండ్ విధించడంతో మహబూబ్‌నగర్ జైలుకు తరలించామని తెలిపారు.

ఇద్దరికి జైలు శిక్ష..

నారాయణపేట: మక్తల్ మండలం దాసరి దొడ్డి గ్రామానికి చెందిన మహదేవ్, ఆంజనేయులుపై ఒక కేసులో నేర నిరూపణ కావడంతో వారికి మంగళవారం నారాయణపేట మొదటి అదనపు మెజిస్ట్రేట్ జాకీయ సుల్తానా ఒక సంవత్సరం జైలు శిక్ష, రూ.500 జరిమానాను విధిస్తూ తీర్పుఇచ్చారు. కేసు వివరాలు ఇలా ఉన్నాయి. 2014 ఆగస్టు 22న మక్తల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదురాలు కటికలి పద్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నారు. తన మరిది కొడుకు భాస్కర్ ఎద్దుల బండి నల్లవైపు నుంచి పోయిందని, దాంతో పాత కక్షలు దృష్టిలో ఉంచుకొని నేరస్థులు మహదేవ్, ఆంజనేయులు నా భర్త అయిన రమ్‌నారాయణను బూతులు తిట్టి, కట్టెతో తలపై బలంగా కొట్టరని పేర్కొన్నారు. రక్తగాయమై చికిత్స నిమిత్తం హైదరాబాద్ ఆస్పత్రికి వెళ్లామని తెలిపారు. ఫిర్యాదుదారు దరఖాస్తుపై అప్పటి మక్తల్ ఎస్‌ఐ మధుసూదన్‌రెడ్డి కేసు నమోదు చేసి నేరస్థులపై కోర్టులో చార్జీ సీటు వేయగా అడిషనల్ పీపీ కె సురేశ్ ఏడుమంది సాక్షులను ప్రవేశపెట్టి వాదనలు వినిపించడంతో నేరస్థులకు మెజిస్ట్రేట్ ఇద్దరికి ఒక్కో సంవత్సరం జైలుశిక్ష , రూ.500 జరిమానా విధించారు. ఈ కేసులో నేరస్థులకు శిక్ష పడడంలో అడిషనల్ పీపీ సురేశ్, సీఐ సీతయ్య, ఎస్‌ఐ పర్వతాలు, కోర్టు డ్యూటీ ఆఫీసర్ బీమ్‌రాజ్‌ను ఎస్పీ అభినందించారు. త్వరలో వారికి రివార్డును అందించనున్నారు.

బాలిక కిడ్నాప్: కేసు నమోదు

లింగాల: మండల పరిధిలోని ఓ గ్రామానికి చెందిన 10వ తరగతి చదవాల్సిన మైనర్ బాలిక కిడ్నాప్ వ్యవహారం మంగళవారం ఆలస్యంగా వెలుగుచూసింది. బాలిక గతనెల 9న ఇంటి నుంచి ఎవరికీ చెప్పకుండా వెళ్లి పోయిందని ఎస్‌ఐ శ్రీనివాస్ తెలిపారు. అదేనెల 20న ఓ యువకుడు బాలికను తీసుకువచ్చి ఇంటి దగ్గర వదిలివెళ్లినట్లు తెలిపారు. కాగా బాలిక కుటుంబ సభ్యులు ఈ వ్యవహారాన్ని గోప్యంగా ఉంచి, నెల తర్వాత బాలిక తండ్రి స్టేషన్‌లో ఫిర్యాదు చేశారని పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేశామని ఎస్‌ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

అడ్డాకుల: మండల కేంద్రంలోని జాతీయ రహదారిపై మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. ఎస్‌ఐ మాధవరెడ్డి వివరాల ప్రకారం.. అడ్డాకులకు చెందిన భూసన్న(55) అదే గ్రామానికి చెందిన ఓ రైతు వద్ద వ్యవసాయ కూలీగా పని చేస్తున్నాడు. ఉదయం పొలం వద్దకు వెళ్తుండగా జాతీయ రహదారిని దాటే క్రమంలో హైదరాబాద్ నుంచి కర్నూలు వైపు వెళ్లే రోడ్డుపై గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. దీంతో తీవ్ర గాయాలై దుర్మరణం చెందాడు. ఆలస్యంగా గుర్తించిన స్థానికులు కుటుంబసభ్యులకు సమాచారం చేరవేశారు. పోలీసులు ఘటనాస్థలానికి వెళ్లి మృతదేహాన్ని జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఆయనకు భార్య చెన్నమ్మ, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. కుమారుడు వెంకటేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

టైర్ పగిలి బొలెరో బోల్తా


ప్రమాద స్థలంలో బొలెరో

ఒకరు మృతి.. నలుగురికి గాయాలు

కొత్తకోట: అతివేగంతో వెళ్తున్న బొలెరో వాహనం టైర్ పగిలి బోల్తా పడింది. ఈ ఘటనలో ఒకరు మృతిచెందగా.. మరో నలుగురికి గాయాలయ్యాయి. ఎస్‌ఐ మంజునాథ్‌రెడ్డి కథనం ప్రకారం.. హైదరాబాద్‌కు చెందిన పీటీపీ కాంట్రాక్టర్ మహ్మద్ ఇర్ఫాన్ నంద్యాలలో పీటీపీ పని చేసేందుకు సిరాజ్‌అహ్మద్, అస్రఫ్‌రాజ, అనిల్‌కుమార్, సునీల్‌కుమార్, కృష్ణలతో కలిసి బొలెరోలో సోమవారం రాత్రి 11 గంటలకు హైదరాబాద్ నుంచి బయలుదేరారు. మంగళవారం తెల్లవారుజామున మండలంలోని అమడబాకుల సమీపంలో జాతీయ రహదారిపై బొలెరో బోల్తా పడింది. డ్రైవర్ మహ్మద్ ఇస్లాం అజాగ్రత్తగా అతివేగంగా నడపడంతో వెనక టైర్ పగిలి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో ఉత్తరప్రదేశ్‌కు చెందిన సిరాజ్ అహ్మద్(38) తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందగా.. అస్రఫ్, అనిల్‌కుమార్, సునీల్‌కుమార్, కృష్ణలకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను వనపర్తి జిల్లా ఆస్పత్రికి తరలించారు. మహ్మద్ ఇర్ఫాన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

భార్యను చంపిన వ్యక్తికి యావజ్జీవ శిక్ష

- రూ.10వేల జరిమానా

ధన్వాడ: భార్యను చంపిన భర్తకు కోర్టు యావజ్జీవ శిక్ష విధించింది. రూ.10వేల జరిమానా విధించింది. ఎస్‌ఐ రమేష్ కథనం ప్రకారం... ధన్వాడకు చెందిన నీరటి కృష్ణయ్యకు చిన్నచింతకుంట మండలం ఉంద్యాలకు చెందిన నీరటి సుశీల(48)తో 30ఏళ్ల క్రితం వివాహమైంది. వారికి సంతానం లేకపోవడంతో, ఓ పాపను దత్తత తీసుకున్నారు. తాగుడుకు బానిసైన కృష్ణయ్య, భార్యతో డబ్బుల కోసం గొడవ పడేవాడు. 2021లో జూన్ 8వ తేదీన రాత్రి గొడవపడ్డారు. ఈక్రమంలోనే భార్య తలను ఇనుప మంచానికి బలంగా కొట్టడంతో చనిపోయింది. దీంతో మృతురాలి తండ్రి కురుమూర్తి ధన్వాడ పోలీస్ స్టేషన్‌లో ఈ సంఘటనపై ఫిర్యాదు చేశారు. అప్పటి ఎస్‌ఐ రాజేందర్, సీఐ శివకుమార్ కేసు నమోదు చేసి, చార్జ్‌షీట్ వేశారు. అడిషనల్ పీపీ మురళీకృష్ణ 9మంది సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టి వాదనలు వినిపించారు. ఈ మేరకు సెషన్స్ జడ్జి ఎండీ రఫీ నేరస్తుడికి యావజ్జీవ కారాగార శిక్ష, రూ.10వేల జరిమానా విధించారు.

‘మార్గదర్శి’పై దర్యాప్తు

ఖాతాదారుల హక్కుల పరిరక్షణకే

ఏపీ సీఐడీ అదనపు డీజీ సంజయ్



సాక్షి, హైదరాబాద్ : మార్గదర్శి చిట్‌ఫండ్స్ ఖాతాదారుల హక్కుల పరిరక్షణ, ఆర్థిక భద్రత కోసమే ఆ సంస్థలో అక్రమాలను వెలుగులోకి తెస్తున్నామని, అది తమ బాధ్యత అని ఏపీ సీఐడీ అదనపు డీజీ సంజయ్ స్పష్టం చేశారు. మార్గదర్శి యాజమాన్యం నిబంధనలకు విరుద్ధంగా నిధులు మళ్లిస్తుండటంతో ఖాతాదారులకు నష్టం కలగకుండా ఇప్పటికే రూ.1,035 కోట్ల విలువైన ఫిక్స్‌డ్ డిపాజిట్లు, మ్యూచ్‌వల్ ఫండ్స్ పెట్టుబడులను అటాచ్ చేసినట్టు తెలిపారు. మార్గదర్శి కంపెనీ ఏ కారణంగానైనా మూతపడితే ఖాతాదారులకు డబ్బులు ఇవ్వాల్సిన బాధ్యత స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ ఐజీపై ఉంటుందని తెలిపారు. మార్గదర్శి సంస్థ ప్రతి చట్టాన్ని, నిబంధనను అతిక్రమించిందని, ఇంకా అతిక్రమిస్తూనే ఉందని చెప్పారు. నిబంధనలకు విరుద్ధంగా ఉన్న 9 బ్రాంచ్‌లలో 23 గ్రూప్ చిట్స్‌ను, వాటికి సంబంధించి రూ.604 కోట్ల టర్నోవర్ నిలిపివేసినట్టు చెప్పారు. ఇదే తరహాలో ఏపీ, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడులోని ఇతర బ్రాంచ్‌ల్లోనూ అక్రమాలపై ఆధారాలు లభిస్తే.. వాటిలోని చిట్ గ్రూప్‌ల టర్నోవర్ నిలిచిపోతుందని చెప్పారు. చివరకు మార్గదర్శి పడిపోతుందన్నారు.

సంజయ్ మంగళవారం ఇక్కడ నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. మార్గదర్శి చిట్‌ఫండ్స్‌లో మూడేళ్ల లావాదేవీలను పూర్తిగా పరిశీలించి, అక్రమాలపై ఆధారాలు సేకరించామన్నారు. ఏపీతోపాటు తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల్లోని 108 బ్రాంచ్‌లలో కార్యకలాపాలపై ఆరా తీస్తున్నట్టు తెలిపారు. ఢిల్లీలోని కేంద్ర ఏజెన్సీలకు కూడా ఈ అక్రమాల సమాచారం ఇచ్చామని, తెలంగాణ, ఇతర రాష్ట్రాల డీజీపీలకు సమాచారం ఇస్తున్నామన్నారు. ఏపీలో పలు ప్రాంతాల్లో నమోదైన ఎఫ్ఐఆర్‌లు, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్ శాఖ ఫిర్యాదు మేరకే ఏపీ సీఐడీ కేసు దర్యాప్తు చేస్తోందని తెలిపారు. పూర్తి నిబంధనలు పాటిస్తూనే ఈ కేసులో ఏ-1 రామోజీరావును, ఏ-2 శైలజాకిరణ్‌ను ప్రశ్నించామన్నారు.

ఖాతాదారులను మభ్యపెడుతున్నారు

మార్గదర్శి అక్రమాలపై ఖాతాదారుల నుంచి ఫిర్యాదు లేకుండానే కేసు దర్యాప్తు చేస్తున్నారంటూ ఒక సెక్షన్ మీడియా ఆరోపణలు చేస్తోందని, అయితే ఖాతాదారులకు వడ్డీని ఆశజూపి ఆ సంస్థ నిబంధనలకు విరుద్ధంగా నిధులను మళ్లిస్తుండటాన్ని తాము వెలుగులోకి తెస్తున్నామని చెప్పారు. ప్రజలు మోసపోయి ఫిర్యాదు చేసేకంటే ముందే తాము వారి సొమ్ము కాపాడేందుకు చర్యలు తీసుకుంటున్నామని, ఏ బాధితుడి విషయంలో అయినా ఇదే పద్ధతి అని స్పష్టం చేశారు. చాక్లెట్ ఇచ్చి బాలికను కిడ్నాప్ చేస్తే.. సమాచారం అందిన వెంటనే పోలీసులు దర్యాప్తు ప్రారంభిస్తారు కానీ, బాధితురాలు ఫిర్యాదు ఇచ్చేవరకు కూర్చోరని.. అదే తరహాలో లక్షల మంది ఖాతాదారుల సొమ్మును కాపాడేందుకు మార్గదర్శిపై దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. ప్రభుత్వ అధికారులుగా ప్రజలకు న్యాయం చేస్తుంటే మార్గదర్శిపై కక్షసాధింపు అంటూ ఆ మీడియాలో దుష్ప్రచారం చేస్తున్నారని అన్నారు. తమ దర్యాప్తు చట్టానికి లోబడి ఉన్నట్టే.. చిట్‌ఫండ్స్ కంపెనీ నిర్వహణలో రామోజీరావు సైతం చట్టానికి లోబడి ఉండాలన్నారు.

చిట్‌ఫండ్స్ చట్టం అమలు కాకుండా ఏకంగా 26 ఏళ్లు అడ్డుకున్నారు

మర్గదర్శి చిట్‌ఫండ్స్ సంస్థను చిట్‌ఫండ్ యాక్ట్ 1982 మేరకు నడపడంలేదని అన్నారు. చిట్‌ఫండ్స్ సొమ్ముతో వేరే వ్యాపారం చేయకూడదన్నారు. చిట్‌ఫండ్ యాక్ట్ ప్రకారమే బ్యాలెన్స్ షీట్లు ఫైల్ చేయాల్సి ఉన్నా.. కంపెనీ యాక్ట్ ప్రకారం నడుచుకుంటున్నామని ఈ కేసులో ఏ-2 శైలజాకిరణ్ అవివేకంతో కూడిన సమాధానాలు చెప్పారని తెలిపారు. ఒక గ్రూప్ డబ్బు మరో గ్రూప్‌కు వాడొద్దని చట్టం చెబుతున్నా.. మార్గదర్శి బ్రాంచ్‌లన్నింటిలోని డబ్బు అక్రమంగా హైదరాబాద్‌లోని కేంద్ర కార్యాలయానికి తరలిస్తున్నట్టు అన్ని ఆధారాలు లభించాయని చెప్పారు. చిట్‌ఫండ్ యాక్ట్ రావడానికి ముందే మార్గదర్శి చిట్‌ఫండ్స్ సంస్థ ప్రారంభమైందన్న వింత వాదన తెస్తున్నారన్నారు. వాస్తవానికి కేంద్ర ప్రభుత్వం 1982లో చిట్‌ఫండ్ యాక్ట్ పాస్ చేస్తే.. దానిని రాష్ట్ర ప్రభుత్వాలు చట్టసభల్లో పాస్ చేయాల్సి ఉందన్నారు. కానీ 26 ఏళ్ల తర్వాత 2008లో అమలు చేశారని, ఇన్నేళ్లూ రామోజీరావు పలుకుబడితో అడ్డుకున్నారని వివరించారు.

నిబంధనలున్నా.. వారికి అనుకూలంగా వాడారు

మార్గదర్శి చిట్‌ఫండ్స్ సంస్థ లావాదేవీలు చిట్‌ఫండ్ యాక్ట్ ప్రకారం కాకుండా రామోజీరావు, శైలజా కిరణ్ వారికి అనుకూలంగా కంపెనీ యాక్ట్ ప్రకారం చూపుతున్నారని దర్యాప్తులో తేలిందన్నారు. ఇదేమని ప్రశ్నిస్తే.. తమకు ఆ నిబంధనలు వర్తించవన్న తరహాలో సమాధానాలిచ్చారన్నారు. ఖాతాదారుల నుంచి సొమ్ము వసూలుకు మాత్రం చిట్‌ఫండ్స్ చట్టాన్నే వాడుకొంటున్నారని చెప్పారు. ఇదే తరహాలో చీరాలలో రూ.65 లక్షల డిఫాల్ట్ కేసులో ష్యూరిటీగా ఉన్న వ్యక్తి నుంచి రూ.6 కోట్లు విలువైన ఆస్తిని అటాచ్ చేయించారని తెలిపారు. ఇలాంటి ఎన్నో అంశాలు దర్యాప్తులో వెలుగులోకి వచ్చాయన్నారు. సంస్థలోని అంతర్గత లుకలుకలు బయటపడతాయనే చిట్‌ఫండ్స్ యాక్ట్‌ను అమలు చేయడంలేదన్నారు.

చిట్ సెటిల్‌మెంట్‌లోనూ నిబంధనలు పాటించడంలేదన్నారు. చిట్ ముగిసిన వారి వివరాలతో, కొన్నింటిలో మానేసిన ఖాతాదారుల పేర్లు వాడి మళ్లీ చిట్‌లు నడుపుతున్నారని, ఇలా ఎన్నో విస్తుపోయే ఆధారాలు లభించాయని తెలిపారు. చిట్ డబ్బు బ్రాంచ్‌లో లేకపోవడంపై ప్రశ్నిస్తే.. మీరెవరు ప్రశ్నించేందుకు అన్న రీతిలో సమాధానాలు ఇస్తున్నారన్నారు. చట్టానికి వారు సహకరించడం లేదని చెప్పారు.

తొక్కతీస్తా.. నార తీస్తా.. ఏమిటీ భాష?

ఎమ్మెల్యే ద్వారంపూడిని దూషించేందుకు మీ సమయాన్ని వృథా చేయొద్దు

జనసేన అధ్యక్షుడు పవన్‌కల్యాణ్‌కు కాపునేత ముద్రగడ లేఖ



సాక్షి ప్రతినిధి, కాకినాడ: జనసేన అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ ఒకపక్క టీడీపీ, బీజేపీతో కలిసి పోటీ చేస్తానంటూ మరోపక్క తనను ముఖ్యమంత్రిని చేయాలని కోరడం హాస్యాస్పదంగా ఉందని కాపు ఉద్యమ నేత, మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం వ్యాఖ్యానించారు. కలసి పోటీ చేస్తే ముఖ్యమంత్రిని చేయమని ఎలా అడుగుతున్నారో అర్థం కావడం లేదన్నారు. పవన్ 175 స్థానాల్లో పోటీ చేస్తే ముఖ్యమంత్రిని చేయాలని కోరడం తప్పు కాదన్నారు. ఓ పార్టీని స్థాపించాక పదిమంది ప్రేమను పొందాలేగానీ వీధి రౌడీ భాషలో మాట్లాడటం ఎంత వరకూ సమంజసమని ప్రశ్నించారు. ఈ మేరకు పవన్‌ను ఉద్దేశించి రాసిన లేఖను ముద్రగడ మంగళవారం మీడియాకు విడుదల చేశారు. పవన్ కళ్యాణ్ అనుసరిస్తున్న తీరు, ప్రజాప్రతినిధులపై ఉపయోగిస్తున్న పరుష పదజాలాన్ని లేఖలో ముద్రగడ తీవ్రంగా తప్పుబట్టారు. ‘ఈ లేఖ రాసినందుకు మీకు ఎక్కడా లేని కోపం రావచ్చు. మీ కోట్లాది మంది అభిమానులు నన్ను తుదిముట్టించే ప్రయత్నం చేయవచ్చు. అయినప్పటికీ నిజాన్ని నిర్భయంగా రాయక తప్పడం లేదు’ అని అందులో పేర్కొన్నారు.

రెచ్చగొట్టి పబ్బం గడుపుకోలేదు

కులాన్ని అడ్డం పెట్టుకుని నేను నాయకుడిగా ఎదగలేదు. కులాన్ని అడ్డు పెట్టుకుని ఎప్పుడూ ఏ పదవీ పొందలేదు. యువతను వాడుకుని భావోద్వేగాలు రెచ్చగొట్టి పబ్బం గడుపుకోలేదు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిపక్ష నేతగా ఉన్నప్పుడు జగ్గంపేట సభలో రిజర్వేషన్ల అంశం తన చేతిలో ఉండదని, అది కేంద్రం పరిధిలో ఉందని అన్నప్పుడు నేను ఇచ్చిన సమాధానం ఏమిటో పవన్ ఎవరినైనా అడిగి తెలుసుకోవాలి. పిల్లి సుభాష్ చంద్రబోస్, బొత్స సత్యన్నారాయణలలో ఒకరిని ముఖ్యమంత్రిని చేయమని కోరా. నేను కోట్లాది రూపాయల కోసం, సూట్‌కేసులకు అమ్ముడు పోవడానికి ఉద్యమం చేయలేదు. నాకంటే చాలా బలవంతుడైన పవన్ నేను వదిలేసిన ఉద్యమాన్ని చేపట్టి కాపు యువతకు రిజర్వేషన్ ఫలాలను ఎందుకు సాధించలేదో చెప్పాలి. పవన్‌కు రాజకీయ సలహాలు ఎవరిస్తున్నారో నాకు తెలియదు. ఆయన మాట్లాడే భాష వల్ల నష్టమేగానీ లాభం ఏమాత్రం ఉండదు. ‘తొక్క తీస్తా.. నార తీస్తా.. కింద కూర్చోబెడతా.. చెప్పుతో కొడతా.. గుండు గీయిస్తా..!’ లాంటి వ్యాఖ్యలు పదేపదే చేస్తున్నారు. ఇప్పటివరకూ ఎంతమందిని అలా చేశారో ఆయనే చెప్పాలి. పవన్ గతంలో నావద్దకు రాయబారులను పంపిస్తే ప్రత్యేక హోదా, రైల్వే జోన్, విశాఖ ఉక్కు, కడప స్టీల్ ప్లాంట్ తదితర సమస్యలపై పోరాడాలని సూచించా. పవన్‌కు నిజంగా రాష్ట్ర ప్రజలపై ప్రేమ ఉంటే ఈ సమస్యలపై యుద్ధం చేయాలి. అంతేకానీ నాలాంటి అనాథలపై కాదు.

ముదుమాల్ నిలువురాళ్లపై అధ్యయనం

- డెక్కన్ హెరిటేజ్ అకాడమీ ట్రస్టుతో రాష్ట్ర వారసత్వ శాఖ ఒప్పందం
- వారసత్వ హోదాకు యునెస్కోకు దరఖాస్తు
- నేటి నుంచి అధ్యయనం షురూ



ఒప్పందం పత్రాలు అందజేస్తున్న శ్రీనివాసగౌడ్



సాక్షి, హైదరాబాద్: దాదాపు నాలుగు వేల ఏళ్ల క్రితం ఆది మానవులు ఏర్పాటు చేసిన నిలువురాళ్ల(మెన్హిర్స్)పై అంతర్జాతీయ స్థాయిలో అధ్యయనం జరగబోతోంది. నారాయణపేట జిల్లాలోని ముడుమాల్‌లో దాదాపు 80 ఎకరాల విస్తీర్ణంలో వేల సంఖ్యలో నిలువు రాళ్లు ఉన్నాయి. ఇందులో కొన్ని 20 అడుగుల ఎత్తుతో ఉన్నాయి. పొడవాటి పెద్ద శిలలు దాదాపు 80 వరకు ఉండగా, చిన్నవి మూడు వేల వరకు ఉన్నాయి. ఇవి క్రీ.పూ.2 వేల ఏళ్ల కంటే పాతవని చరిత్ర పరిశోధకులు అభిప్రాయం. యునెస్కో గుర్తింపు పొందిన లండన్ సమీపంలోని స్టోన్ హెంజ్‌కు ఏ మాత్రం తీసిపోని రీతిలో ముడుమాల్ నిలువు రాళ్లకు ప్రాధాన్యం ఉన్నప్పటికీ ఇంతకాలం తీవ్ర నిర్లక్ష్యం జరుగుతూ వచ్చింది. ఇన్నేళ్లకు వాటి ప్రత్యేకతలపై ఆధునిక పద్ధతిలో అధ్యయనం, డాక్యుమెంటేషన్ చేయబోతున్నారు. చాలా రాళ్లు ఒంగిపోగా, కొన్ని కూలిపోయాయి. గతంలో అవి ఎలా ఉండేవో గుర్తించి వాటిని సరిచేసి ఆ ప్రాంతాన్ని రక్షిత ప్రాంతంగా గుర్తించి పరిరక్షించేందుకు ఎట్టకేలకు తెలంగాణ వారసత్వ శాఖ సిద్ధమైంది. ఆ మేరకు డెక్కన్ హెరిటేజ్ అకాడమీ ట్రస్టుతో ఆ శాఖ ఒప్పందం కుదుర్చుకుంది. కొద్ది రోజుల క్రితమే ఆ ఒప్పందం జరగ్గా, మంగళవారం అందుకు సంబంధించిన పత్రాలను మంత్రి శ్రీనివాసగౌడ్ అందజేశారు.

ఆధునిక పద్ధతుల్లో డాక్యుమెంటేషన్

ట్రస్టు చైర్మన్ వేదకుమార్, సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ కె.పుల్లారావు, , ఏఎస్ఐ విశ్రాంత అధికారులు బాబ్జీరావు, తాహెర్, కొత్త తెలంగాణ చరిత్ర బృందం కన్వీనర్ హరగోపాల్, మొయినాబాద్‌లోని జేబీఆర్ ఆర్కిటెక్ట్ కాలేజీ స్కాలర్లు తదితరులు ఈ ప్రాంతంపై ఏడాది కాలంపాటు అధ్యయనం, ఆధునిక పద్ధతుల్లో డాక్యుమెంటేషన్ చేయబోతున్నారు.

నక్షత్రాల వరుసను పోలిన...

ఆదిమానవుల కాలంలో మృతి చెందిన ప్రముఖుల సమాధి వద్ద నిలువురాళ్లకు స్మారకంగా పాతడం ఆనవాయితీ. వాటని మెన్హిర్స్ అంటారు. ముడుమాల్‌లోని నిలువురాళ్లు కూడా అలాంటి స్మారక శిలలే. అయితే వాటిని ఒకేచోట ఎక్కువ సంఖ్యలో ఏర్పాటు చేయటం ద్వారా అప్పట్లో ఖగోళ పరిశోధనశాలగా వినియోగించారని పరిశోధకులు గతంలో గుర్తించారు. సూర్యుడు గమనం వల్ల ఆ రాళ్ల నీడల్లో వచ్చే మార్పుల ఆధారంగా వాతావరణాన్ని అంచనా వేసేవారని, అక్కడి ఓ రాతిపై సప్తర్షి మండలం (ఉర్సా మేజర్)గా పేర్కొనే నక్షత్రాల వరసను పోలి ఉండటాన్ని గతంలో పరిశోధకులు గుర్తించారు. లండన్ సమీపంలోని స్టోన్ హెంజ్ వద్దకూడా అలాంటి ఏర్పాటే ఉండటం విశేషం. ఇప్పుడు లోతైన అధ్యయనం ద్వారా మరిన్ని వివరాలు తెలుసుకోనున్నారు. ఈమేరకు మంగళవారమే వేదకుమార్, కేపీఆర్ తదితరులు పరిశోధనల కోసం ముడుమాల్ వెళ్లారు.

నేడు అతి తాపపు రోజు కావడంతో

జూన్ 21 వేసవి అతి తాపపు రోజు. ఆ రోజు సూర్యుడి గమనంలో మార్పు వస్తుంది. ఇది పరిశోధనలకు మరింత అనుకూలంగా ఉంటుందన్న ఉద్దేశంతో వెంటనే పని ప్రారంభించినట్టు పరిశోధకులు పేర్కొంటున్నారు. భవిష్యత్తులో దీని ప్రత్యేకతలు మరిన్ని వెలుగులోకి వస్తే, దాని ఆధారంగా ఈ ప్రాంతాన్ని ప్రపంచ వారసత్వ హోదా గుర్తింపు కోసం యునెస్కోకు దరఖాస్తు చేయనున్నారు.

కాలుష్యంపై పోరుబాట



భిక్కనూరు ఎంఎస్ఎన్ ఫ్యాక్టరీ ముందు ధర్నా చేస్తున్న ప్రజలు

భిక్కనూరు: కామారెడ్డి జిల్లా భిక్కనూరు మండల కేంద్రం సమీపంలోని ఫార్మా కంపెనీ ఎంఎస్ఎన్ లైఫ్ సైన్సెస్ ప్రైవేట్ లిమిటెడ్‌ను మంగళవారం కాచాపూర్, అయ్యవారిపల్లి, మాందాపూర్, సంగమేశ్వర్ అంతంపల్లి, పెద్దమల్లారెడ్డి గ్రామాల ప్రజలు పెద్ద ఎత్తున ముట్టడించారు. ఫ్యాక్టరీ నుంచి వెదజల్లుతున్న వ్యర్థాలు, విష వాయువులను నివారించాలని డిమాండ్ చేస్తూ కాచాపూర్ గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన దీక్షలు 57వ రోజుకు చేరుకున్నాయి. యాజమాన్యం నుంచి ఎలాంటి స్పందన రాకపోడంతో బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కాటిపల్లి వెంకటరమణరెడ్డి, ఐదు గ్రామాల ప్రజలు ఫ్యాక్టరీ ముట్టడికి బయల్దేరారు. విషయం తెలుసుకున్న పోలీసులు పెద్దమల్లారెడ్డి గ్రామశివారులోని చాకలి ఐలమ్మ విగ్రహం వద్ద వారిని అడ్డుకున్నారు. కామారెడ్డి డీఎస్పీ సురేశ్ ఫ్యాక్టరీ ప్రతినిధి రవీందర్‌రెడ్డిని వెంటబెట్టుకుని వచ్చారు. వీడీసీ అధ్యక్షుడు మైపాల్ మాట్లాడుతూ ఫ్యాక్టరీ వల్ల వాతావరణంతో పాటు నీరు కలుషితమవుతోందని, ప్రజల ఆరోగ్యం చెడిపోతోందని తెలిపారు. ఫ్యాక్టరీ వల్ల ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చేస్తామని ఫ్యాక్టరీ ప్రతినిధి రవీందర్‌రెడ్డి హామీ ఇచ్చారు. ఐదు గ్రామాల నుంచి మొత్తం ఐదుగురిని కమిటీలోకి తీసుకుంటామని, డీఎస్పీతో పాటు ఫ్యాక్టరీ సిబ్బంది ఐదుగురు, కాలుష్య నియంత్రణ మండలి అధికారులతో కలిసి కలెక్టర్ ఆధ్వర్యంలో కమిటీని ఏర్పాటు చేస్తామనడంతో ధర్నాను విరమించారు.

శ్రీశైలంలో 809.0 అడుగుల నీటిమట్టం

దోమలపెంట: శ్రీశైలం జలాశయంలో మంగళవారం 809.0 అడుగుల నీటిమట్టం, 33.7180 టీఎంసీల నీటి నిల్వ ఉంది. గడిచిన 24 గంటల వ్యవధిలో రేగుమాన్‌గడ్డ నుంచి ఎంజీకేఎల్ఐకు 1,472 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. జలాశయంలో 214 క్యూసెక్కుల నీరు ఆవిరైంది.

రామన్‌పాడులో 1,017 అడుగులు

మదనాపురం: రామన్‌పాడు జలశయంలో మంగళవారం నీటి మట్టం 1,017 అడుగుల మేర నిల్వ ఉంది. జూరాల ఎడమ కాల్వ, సమాంతర కాల్వకు వచ్చే నీటిని నిలిపివేశారు. రామన్‌పాడు నుంచి ఎన్టీఆర్ కాల్వ నీటిని నిలిపివేసారు. తాగునీటి అవసరాల కోసం 20 క్యూసెక్కుల నీటిని వినియోగిస్తున్నామని ఏఈ సింగిరెడ్డి రనీల్‌రెడ్డి, తెలిపారు.

శ్రీకాంత్ డబుల్ సెంచరీ

- హెచ్‌సీఏ 2డే లీడ్‌లో ఉమ్మడి జిల్లా జట్టు 530/8



మహబూబ్‌నగర్ క్రీడలు: హైదరాబాద్‌లో హెచ్‌సీఏ బీ–డివిజన్ రెండు రోజుల లీగ్ చాంపియన్‌షిప్‌లో మంగళవారం ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా జట్టు (ఎండీసీఏ) భారీ స్కోరు చేసింది. తెలంగాణ క్రికెట్ క్లబ్ జట్టుతో జరుగుతున్న రెండో మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన ఎండీసీఏ జట్టు 84 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 530 పరుగులు చేసింది. జట్టులో ఎ.శ్రీకాంత్ అద్భుతమైన బ్యాటింగ్‌తో డబుల్ సెంచరీ చేశాడు. 206 బంతుల్లో 30 ఫోర్లతో 200 పరుగులు చేశాడు. ఓపెనర్ హర్షవర్ధన్ 99 (83 బంతుల్లో 10 ఫోర్లు, 6 సిక్స్‌లు) పరుగులతో రాణించాడు. ప్రత్యర్థి జట్టులో రోనిత్ నారాయణ 5 వికెట్లు తీశాడు. బుధవారం రెండో రోజు మ్యాచ్ కొనసాగనుంది.

స్పోర్ట్స్ స్కూల్‌కు వేళాయె



మహబూబ్‌నగర్‌లోని మెయిన్ స్టేడియంలో స్పోర్ట్స్ స్కూళ్ల సెలక్షన్‌కు సాధన చేస్తున్న చిన్నారులు

- రాష్ట్రంలోని హకీంపేట, కరీంనగర్, అదిలాబాద్‌లో స్కూళ్లు
- ప్రతి పాఠశాలలో 40 మందికి అవకాశం
- 4, 5వ తరగతిలో ప్రవేశం
- జిల్లా, ఆపై రాష్ట్రస్థాయిలో ఎంపిక
- వచ్చేనెల చివరి వారంలో చేరికలు



స్పోర్ట్స్ స్కూల్ జిల్లాస్థాయి ఎంపికలు (ఫైల్)

మహబూబ్‌నగర్ క్రీడలు: రాష్ట్రంలోని మూడు ప్రాంతీయ క్రీడా పాఠశాలల్లో ఈ విద్యా సంవత్సరానికి 4, 5వ తరగతిలో ప్రవేశాలకు వచ్చే నెలలో రాష్ట్రస్థాయి సెలక్షన్స్ నిర్వహించనున్నారు. మేడ్చల్ జిల్లాలోని హకీంపేట, కరీంనగర్, అదిలాబాద్‌లో స్పోర్ట్స్ స్కూళ్లు ఉన్నాయి. వీటిలో కేవలం 4, 5వ తరగతిలో మాత్రమే ప్రవేశం ఉంటుంది. ఈ ఎంపికల్లో పాల్గొనే విద్యార్థులకు కొన్ని శారీరక, సామర్థ్యానికి సంబంధించిన వాటితోపాటు పలు పోటీల్లో పరీక్షలు నిర్వహించి ఎంపికచేస్తారు. ఎవరైతే ఉత్తమ ప్రతిభకనబరిచి ఎక్కువ స్కోర్ సాధిస్తారో వారికి 4, 5వ తరగతిల్లో ప్రవేశం లభిస్తుంది. రాష్ట్రంలోని పై మూడు స్పోర్ట్స్ స్కూళ్లు ఉండగా ప్రతి స్కూల్‌లో 4వ తరగతిలో 10 మంది బాలురు, 10 మంది బాలికలు, 5వ తరగతిలో 10 మంది బాలురు, 10 మంది బాలికలు ఎంపికవుతారు.

పోటీలకు ఇలా రావాలి..

జిల్లాస్థాయి ఎంపిక పోటీలకు హాజరయ్యే విద్యార్థులు తమ వయస్సు ధ్రువీకరణ పత్రాలు పాఠశాల ప్రధానోపాధ్యాయుడితోపాటు మున్సిపాలిటీ, పంచాయతీకి సంబంధించిన వయస్సు ధ్రువపత్రాలతో రావాలి. అలాగే రెండు పాస్ పోర్టు సైజ్ ఫొటోలు, 3, 4వ తరగతి పాస్ సర్టిఫికెట్‌తో జిల్లాస్థాయి ఎంపికలకు హాజరుకావాల్సి ఉంటుంది.

వచ్చే నెలలో ఎంపికలు

జిల్లాస్థాయి స్కూల్ స్పోర్ట్స్ స్కూల్ సెలక్షన్స్ వచ్చేనెల రెండు లేదా మూడో వారంలో నిర్వహించనున్నారు. శారీరక సామర్థ్య పరీక్షల్లో కనీసం 10 పాయింట్లు స్కోర్ సాధిస్తే రాష్ట్రస్థాయికి పంపిస్తారు. రాష్ట్రస్థాయి స్పోర్ట్స్ స్కూల్ సెలక్షన్స్ వచ్చే నెల 24 నుంచి 30 వరకు నిర్వహించనున్నారు. ఆగస్టు చివరివారంలో ఎంపికైన విద్యార్థులకు స్పోర్ట్స్ స్కూళ్లలో ప్రవేశాలు కల్పించనున్నారు. అయితే గత కొన్నేళ్ల నుంచి మండలస్థాయిలో స్పోర్ట్స్ స్కూళ్ల ఎంపికలు నిర్వహించకుండా నేరుగా జిల్లాస్థాయి సెలక్షన్స్ చేపడుతున్నారు.

ఎక్కువ మంది ఎంపికవ్వాలి..



గతేడాది జిల్లా నుంచి 15 మంది స్పోర్ట్స్ స్కూళ్లకు ఎంపికయ్యారు. ఈసారి అంతకంటే ఎక్కువ మంది కావాలి. చిన్నారులు ఇప్పటి నుంచే స్పోర్ట్స్ స్కూళ్లకు సన్నద్ధం కావాలి. వచ్చేనెల రెండు లేదా లేదా మూడో వారంలో జిల్లాస్థాయి సెలక్షన్స్ నిర్వహించడానికి తగిన చర్యలు తీసుకుంటాం. త్వరలో జిల్లాస్థాయి ఎంపికల తేదీలు ప్రకటిస్తాం. జిల్లాస్థాయి స్పోర్ట్స్ స్కూళ్ల ఎంపికలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి.

– శ్రీనివాస్, డీవైఎస్ఓ, మహబూబ్‌నగర్

ఇవి అర్హతలు..

4వ తరగతి ప్రవేశాల కోసం 01.09.2014 నుంచి 31.08.2015 మధ్య పుట్టిన వారు అర్హులు. 5వ తరగతి ప్రవేశాలకు హాజరయ్యే విద్యార్థులు 01.09.2013 నుంచి 31.08.2014 మధ్య పుట్టిన వారు స్పోర్ట్స్ స్కూల్ సెలక్షన్స్‌లో పాల్గొనడానికి అర్హులు.

నిర్వహించే పరీక్షలు..

ఎత్తు, బరువు, 30 మీటర్ల ఫ్లయింగ్ స్టార్ట్, స్టాండింగ్ బ్రాడ్‌జంప్, 800 మీటర్ల రన్నింగ్, 6 గీ 10 మీటర్ల షటిల్ రన్, మెడిసన్ బాల్‌త్రో, వర్టికల్ జంప్, ఫ్లెక్సిబిలిటీ టెస్ట్, మెడికల్ టెస్ట్

మన్యంకొండలో బడ్జెట్ హోటల్

- అద్భుతమైన ఆధ్యాత్మిక క్షేత్రంగా తీర్చిదిద్దుతాం
- ఏడాదిలోగా హరిత హోటల్, కల్యాణ మండపం పూర్తిచేస్తాం
- రాష్ట్ర ఎక్సైజ్, క్రీడాశాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్



బడ్జెట్ హోటల్ పనులకు భూమిపూజ చేస్తున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్

మహబూబ్‌నగర్ రూరల్: మన్యంకొండ శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయాన్ని అద్భుతమైన ఆధ్యాత్మిక క్షేత్రంగా తీర్చిదిద్దుతామని రాష్ట్ర ఎక్సైజ్, క్రీడాశాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. మంగళవారం మన్యంకొండ వద్ద రూ.15 కోట్లతో నిర్మించనున్న శ్రీవేంకటేశ్వర హరిత హోటల్, శ్రీవేంకటేశ్వర కల్యాణ మండపానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ తెలంగాణ రాక ముందు మన్యంకొండ బ్రహ్మోత్సవాల సందర్భంగా ఇక్కడికి వచ్చిన భక్తులకు కనీసం స్నానం చేసేందుకు, తాగడానికి సైతం మంచినీరు ఉండేది కాదని, కోనేటిలో స్నానాలు ఆచరించిన వారందరికి జబ్బు వచ్చేవని ఆవేదన వ్యక్తం చేశారు. భక్తుల కోసం కల్యాణ మండపాన్ని నిర్మించామని, అలాగే కొండపైన 18 రూములతో ఏసీ వసతి సదుపాయం కల్పించామని చెప్పారు. మన్యంకొండలో మంచి వాతావరణం కల్పించేలా ప్రతిఒక్కరు పనుల్లో భాగస్వాములు కావాలని, ఇటీవలే మన్యంకొండ పైకి డబుల్ రోడ్డుతో పాటు సెంట్రల్ లైటింగ్, సెంట్రల్ మీడియన్ ఏర్పాటు చేశామని, ఎక్కడైనా సెంట్రల్ లైటింగ్ పాడైతే తక్షణమే వేయించాలన్నారు. వెంకటేశ్వర పార్కుతోపాటు ఆంజనేయస్వామి విగ్రహాన్ని నిర్మిస్తున్నామని, అలాగే పక్కనే ఉన్న ఎన్నో ఏళ్ల నుంచి నిరాధారణకు గురైన శ్రీలక్ష్మీనరసింహస్వామి గుడిని పునరుద్ధరించామని, ప్రస్తుతం నిత్య పూజలు జరుగుతున్నాయని వివరించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్వర్‌గౌడ్, ఎంపీపీ సుధాశ్రీ, వైస్ ఎంపీపీ అనిత, రైతుబంధు మండలాధ్యక్షుడు దేవేందర్‌రెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ రాజేశ్వర్‌రెడ్డి, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు అల్లావుద్దీన్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గిరిధర్‌రెడ్డి, ఆలయ చైర్మన్ అళహరి మధుసూదన్‌కుమార్, తహసీల్దార్ పాండు, ఎంపీడీఓ జ్యోతి, టూరిజం డీఈ పరుశవేది, ఏఈ మధు పాల్గొన్నారు.

ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

- రాష్ట్ర కాంగ్రెస్ మైనార్టీ విభాగం అధ్యక్షుడు అబ్దుల్లా సోహైల్



మాట్లాడుతున్న షేక్ అబ్దుల్లా సోహైల్

స్టేషన్ మహబూబ్‌నగర్: రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని రాష్ట్ర మైనార్టీ కాంగ్రెస్ విభాగం అధ్యక్షులు షేక్ అబ్దుల్లా సోహైల్ అన్నారు. జిల్లాకేంద్రంలోని కాంగ్రెస్ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం కేసీఆర్ ఎన్నికల్లో మైనార్టీలకు ఇచ్చిన హామీలను విస్మరించారని ఆరోపించారు. రిజర్వేషన్ పేరుతో మైనార్టీలను మోసం చేసినట్లు విమర్శించారు. మైనార్టీలకు ఇచ్చిన హామీలు, రిజర్వేషన్లపై కేసీఆర్ తీరును ఎండగడుతూ పవర్ ప్రజేంటేషన్ ద్వారా గ్రామాల్లోకి తీసుకెళతామన్నారు. రాజీవ్‌గాంధీ ఆన్‌లైన్ క్విజ్‌పోటీల్లో యువత అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. జూలై చివరివారంలో మైనార్టీ విభాగం నాయకులతో ఒక్క రోజు శిక్షణ కార్యక్రమం ఉంటుందని, ప్రియాంకగాంధీ హాజరవుతారని తెలిపారు. మైనార్టీ విభాగం జాతీయ అధ్యక్షులు ఇమ్రాన్ ప్రతాప్‌ఘుడి సమావేశాన్ని జిల్లాలో వచ్చేనెలలో నిర్వహించడానికి ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు తెలిపారు. మైనార్టీ కమిటీల నియామక ప్రక్రియను ఈ నెల చివరినాటికి పూర్తి చేయాలని కోరారు. జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు జి.మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వాల హయాంలో మైనార్టీల సంక్షేమానికి కృషి చేసినట్లు తెలిపారు. మైనార్టీలకు 4 శాతం రిజర్వేషన్లు కల్పించినట్లు తెలిపారు. బీఆర్ఎస్ అసమర్థత పాలన, గతంలో కాంగ్రెస్ పార్టీ చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. సమావేశంలో డీసీసీ అధ్యక్షులు మధుసూదన్‌రెడ్డి, టీపీసీసీ ఉపాధ్యక్షులు ఒబేదుల్లా కొత్వాల్, ప్రధాన కార్యదర్శి సంజీవ్ ముదిరాజ్, జిల్లా మైనార్టీ విభాగం అధ్యక్షులు జహీర్‌అక్తర్, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు వసంత పాల్గొన్నారు. అనంతరం పార్టీ కార్యాలయంలో ఉమ్మడి జిల్లా మైనార్టీ విభాగం సమీక్షా సమావేశం నిర్వహించారు. రాష్ట్ర అధ్యక్షులు అబ్దుల్లా సోహైల్ మైనార్టీ విభాగం నాయకులు, కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు.

చేనేతకు చేయూత కల్పిస్తాం



కార్మికులతో మాట్లాడుతున్న ఆంధ్రప్రదేశ్ హస్తకళల అభివృద్ధి చైర్మన్ బడి గుంచల విజయలక్ష్మి

నారాయణపేట టౌన్: జిల్లా కేంద్రంలోని బాపునగర్‌లో శ్రీ చౌడేశ్వరి మాత ఆలయంలో ఆంధ్రప్రదేశ్ హస్తకళల అభివృద్ధి చైర్మన్ బడి గుంచల విజయలక్ష్మి దంపతులు అమ్మవారికి దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా వచ్చిన వారిని చేనేత కార్మిక వర్గానికి తమవంతుగా సహాయం చేసి స్టాళ్లలో నారాయణపేట చీరలను కొనుగోలు చేసేటట్లు చూడాలని జిల్లా సంఘం నాయకులు కోరారు. అనంతరం జిల్లా తొగట వీర క్షత్రియ సేవా సంఘం అధ్వర్యంలో పూలమాల, శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్‌లో ఏర్పాటు చేసే స్టాళ్లలో నారాయణపేట చీరలు అమ్ముకునేందుకు అవకాశం కల్పిస్తామని విజయలక్ష్మి అన్నారు. అంతకుముందు పట్టణంలో కార్మికుల స్థితిగతులు తెలుసుకున్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు చింత శంకర్, ప్రధాన ప్రధానకార్యదర్శి మురళీమోహన్, గౌరవాధ్యక్షుడు రామకృష్ణ, పద్మశాలి సంఘం అధ్యక్షుడు క్యాతన్ రఘునాథ్, జాతీయ బీసీ సంఘం కార్యదర్శి చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

వచ్చే నెల 23న పండుగ సాయన్న విగ్రహ ప్రతిష్ఠ

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): బహుజన వీరుడు పండుగ సాయన్న విగ్రహాన్ని వచ్చే నెల 23న జిల్లా కేంద్రంలో ప్రతిష్ఠించనున్నట్లు పండుగ సాయన్న సామాజిక సేవా సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణముదిరాజ్ అన్నారు. మంగళవారం జిల్లాకేంద్రంలోని సంఘం కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ విగ్రహాన్ని స్థాపించడానికి తొమ్మిదేళ్ల క్రితమే అప్పటి కలెక్టర్ వద్ద అనుమతి తీసుకున్నట్లు చెప్పారు. అందరికోసం పనిచేసిన సాయన్న విగ్రహ ఏర్పాటుకు పార్టీలకతీతంగా సహకరించాలని కోరారు. జిల్లాకేంద్రంలో నిర్మిస్తున్న ట్యాంక్‌బండ్‌పై 132 అడుగుల పండుగ సాయన్న విగ్రహాన్ని పెట్టాలని డిమాండ్ చేశారు. తెలంగాణ బీసీ మహా సభ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్ మాట్లాడుతూ ముదిరాజ్‌లు ఐక్యంగా ఉండి బహుజన వీరుడు పండుగ సాయన్న విగ్రహ ఏర్పాటుకు సహకరించాలని కోరారు. సమావేశంలో గోపి తదితరులు పాల్గొన్నారు.